# సీరం టెస్టులు షురూ



**రాపిడ్ టెస్టుల స్థానంలో సీరం టెస్టు**

**3 జిల్లాలు, 30 గ్రామాలు, 1200 మంది**

**త్వరలో గ్రేటర్ తో పాటు 10 నగరాల్లోనూ...**

**ఇంటింటా జ్వర పరీక్షలకు సిద్ధమైన రాష్ట్రప్రభుత్వం**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** దేశవ్యాప్తంగా రాండమ్ పద్ధతిలో తల పెట్టిన సీరం సర్వైలెన్స్ రాష్ట్రంలో శుక్రవారం ప్రారంభమైంది. కరోనా వ్యాప్తి క్షేత్రస్థాయిలో ఏ మేరకు వ్యాపించింది... ఆ వైరస్ సోకినవారిలో ఏ మేరకు నిరోధక శక్తి ఏర్పడింది...అనే విషయాలను పరీక్షల ద్వారా నిర్ధారణ చేయనున్నట్లు ఐసీఎంఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసర్చ్ - భారత ఔషధ పరిశోధన మండలి) ప్రకటించింది.

### రాపిడ్ టెస్టులకు ప్రత్యామ్నాయం...

గతంలో రాపిడ్ టెస్టులు చేయాలని భావించిన ఐసీఎంఆర్, వాటిలో నిర్ధారణ ఖచ్చితత్వం లోపించిన కారణంగా ఆ నిర్ణయాన్ని వెనుకకు తీసుకుంది. దానికి ప్రత్యామ్నాయంగా సీరం సర్వైలెన్స్ పరీక్షను రూపొందించింది. ఈ పరీక్షల్లో నిర్ధారణ ప్రమాణాలు మెరుగ్గా ఉన్నట్లు పరిశీలనలో తేలటంతో దేశవ్యాప్తంగా రాండమ్ పద్ధతిలో సీరం సర్వైలెన్స్‌ను అమలు చేస్తోంది. దేశవ్యాప్తంగా కరోనా ప్రభావం ఉన్న 21 రాష్ట్రాలను ఎంపిక చేసింది. ఆయా రాష్ట్రాల్లో ఎంపిక చేసిన 60 జిల్లాల్లో సీరం సర్వైలెన్స్ ను జరుపుతోంది. యుద్ధప్రాతిపదికన జరుగుతున్న ఈ పరీక్షల ఫలితాలు వారం రోజుల్లో కేంద్ర ప్రభుత్వానికి అందనున్నాయి. సంస్థ డైరెక్టర్ హేమలత పర్యవేక్షణలో పబ్లిక్ హెల్త్ విభాగం సైంటిస్టు లక్ష్మయ్య నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్నారు.

### 3 జిల్లాలు, 30 గ్రామాలు, 12వందల మంది..

రాష్ట్రంలో కామారెడ్డి, నల్గొండ, సంగారెడ్డి, జనగాంలలో ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఒక్కో జిల్లా నుంచి 10 గ్రామాల చొప్పున మొత్తం 3 జిల్లాల్లో 30 గ్రామాలను ఎంపిక చేశారు. ఒక్కో గ్రామంలో 40 మంది నుంచి సీరం సేకరిస్తున్నారు. ఇందుకోసం ఒక్కో జిల్లాకు 5 బృందాల చొప్పున మొత్తం 3 జిల్లాల్లో 15 బృందాలు పర్యటిస్తున్నాయి. వీటిలో ఐసీఎంఆర్ కేటాయించిన ముగ్గురు అధికారులున్నారు. వారిలో ఒక వైద్యాధికారి, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక పరిశోధకుడు ఉన్నారు. సీరం సేకరణ సాఫీగా సాగేందుకు వీరికి అండగా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం నిలిచింది. రాష్ట్ర వైద్యారోగ్య సిబ్బంది ఆశా వర్కర్లు, ఏఎన్ఎంల నుంచి జిల్లా వైద్యారోగ్య అధికారుల వరకు పాల్గొంటున్నారు. సీరం సర్వైలెన్స్‌కు ఎంచుకున్న గ్రామాల్లో 9 గ్రామీణ ప్రాంతానికి చెందిన గ్రామాలు,ఒకటి పట్టణ ప్రాంతానికి చెందిన గ్రామం ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఆయా గ్రామాల్లోని ప్రజల్లో 18 ఏళ్లు దాటినవారి నుంచే సీరం పరీక్ష నమూనాలు సేకరిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లాకు 400 మంది చొప్పున ఈ 3 జిల్లాల్లో మొత్తం 1200 మంది నుంచి పరీక్షల నమూనాలు సేకరించాలని నిర్ణయించారు. సేకరించిన సీరం నమూనాలను చెన్నై ఐసిఎంఆర్ లాబ్‌కు పంపించి విశ్లేషణ చేస్తారు.

కేంద్రం పరిశీలించిన తరువాత ఆ నివేదికలను అధికారికంగా రాష్ట్రాలకు పంపించనున్నారు. 2 నుంచి 3 రోజుల్లో గ్రేటర్‌తో పాటు 10 నగరాల్లో.. వీటి తరువాత మరో 10 నగరాల్లో ఈ సీరం సర్వైలెన్స్ జరుపాలని ఐసీఎంఆర్ నిర్ణయించింది. ఈ 10 నగరాల జాబితాలో హైదరాబాద్ మహానగరం కూడా ఉన్నట్లు ఐసీఎంఆర్ అధికారులు వెల్లడించారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇంటింటా జ్వర పరీక్షలకు సిద్ధమైంది.